

పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న విశ్వకర్మ ఫౌండేషన్‌సేవా సమితి ప్రతినిధులు.

విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో గురు పౌర్ణమి

పంజాగుట్ట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సమాజంలో సమానత్వం, శాంతి నెలకొల్పడానికి తాత్విక చింతనతో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పునాదులు వేశారని పలువురు వక్తలు పేర్కొన్నారు. ఆదివారం గురు పౌర్ణమి సందర్భంగా సోమాజిగూడలోని ప్రెస్‌క్లబ్‌లో విశ్వకర్మ ఫౌండేషన్ సేవా సమితి ఆధ్వర్యంలో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి చిత్ర పటానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ తాటికొండ వెంకటరాజయ్య మాట్లాడుతూ వీరబ్రహ్మేంద్రస్వామి సమాజానికి సమానత్వం, శాంతి చేకూర్చేందుకు తాత్విక చింతనతో మార్గ దర్శనం చేశారని అన్నారు. సత్య శోధన కాదు సత్యంగా జీవించాలని బోధించారని పేర్కొన్నారు. సత్యానికి దూరంగా జీవిస్తున్నాం కాబట్టే శాంతికి దూరంగా జీవిస్తున్నామని ఫౌండేషన్ ప్రతినిధి విఠలా చార్యులు అన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు ఎ.రవీంద్రచారి, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, కార్యదర్శి ప్రొఫెసర్ రఘువీర్, రాజేంద్ర ప్రసాద్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు వెల్దండ వెంకటేష్, రాజ్‌కుమార్ పటేల్
-బంజారాహిల్స్, ఆంధ్రజ్యోతి

చెట్ల కొమ్మలు కొట్టేశారు... తొలగించడం మరిచారు

పంజాగుట్ట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ ఆనంద్‌నగర్ కాలనీలోని మాతృకృప అపార్ట్‌మెంట్ ఎదుట 20 రోజుల క్రితం విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్నాయని చెట్ల కొమ్మలను విద్యుత్ శాఖ సిబ్బంది కొట్టేశారు. రోజులు గడుస్తున్నా వాటిని తొలగించడం మరిచారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు చెట్టు కొమ్మలు అడ్డుగా ఉండడంతో వర్షపునీరు అక్కడే నిలిచి పోయి దోమలు వృద్ధి చెందుతున్నాయని, దీంతో తాము అనారోగ్యాల బారిన పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.



ఆనంద్‌నగర్ కాలనీ మాతృకృప అపార్ట్‌మెంట్ ఎదుట చెట్ల కొమ్మలు

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదం

● తీవ్రంగా గాయపడిన ఇద్దరు యువకులు

ఖైరతాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పైన ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు యువకులు ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదానికి గురయ్యారని సమాచారం అందడంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా ఫ్లైఓవర్ మధ్యలో ఇంకా రిజిస్ట్రేషన్ కాని యమహా వాహనంపై రాజ్ కుమార్(18) వాహనాన్ని నడుపుతుండగా వివేక్ అనే యువకుడు వెనక కూర్చోగా వారంతట వారే డివైడర్‌ను ఢీకొని పడిపోయినట్టు గుర్తించారు. వారిద్దరూ అపస్మారక స్థితిలో ఉండగా 108 అంబులెన్స్‌లో గ్లోబల్ ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. మరో మిత్రుడు ఆస్పత్రికి రావడంతో అతడిద్వారా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, కేసు విచారిస్తున్న ఎస్‌ఐ రమణ తెలిపారు.



రక్తదానం శిబిరంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

మౌలాలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ప్రతినిధులు మొక్కలను నాటడంతో పాటు రక్తదానం చేయడం అభినందనీయమని డీఏవీ పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ శేషాద్రీనాయుడు పేర్కొన్నారు. ఆదివారం వినాయకనగర్ డివిజన్ చంద్రగిరికాలనీలో గల డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ మల్కాజిగిరి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం స్కూల్ ఆవరణలో వంద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ పూర్వ గవర్నర్ ఆవుల గోపాల్‌రావు, గవర్నర్ మనోహర్‌రెడ్డి, లయన్స్ ప్రతినిధులు రవీంద్రనాథ్‌గుప్తా, అశోక్ స్పైన్, బాలచందర్‌గైడ్, క్లబ్ అధ్యక్షుడు పాండురంగగుప్తా, కార్యదర్శి సాంబశివరావు, మాశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి

బర్కత్‌పుర, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రైలు ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతిచెందాడు. కాచిగూడ రైల్వేపీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన కమలేష్‌కుమార్ సింగ్(50) ఆరాంఘర్‌లో నివసిస్తూ ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆదివారం ఉదయం డ్యూటీకి వెళ్లడానికి బుద్వేల్-శివరాంపల్లి రైల్వే స్టేషన్ల మధ్య ఆరాంఘర్ బ్రిడ్జి వద్ద పట్టాల వెంట నడుచుకుంటూ వెళ్తుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బీసీలకు రూ.2 లక్షల కోట్ల బడ్జెట్ కేటాయించాలి

రాంనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు రూ. 2 లక్షల కోట్లు కేటాయించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ అధ్యక్షతన జరిగిన 14 బీసీ సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జనాభాలో సగం ఉన్న బీసీల సంక్షేమాన్ని కేంద్రం విస్మరించిందన్నారు. మండల్ కమిషన్ సిఫారసుల ప్రకారం కేంద్ర ఉద్యోగాలు, విద్యా సంస్థలలో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న స్కీమ్‌లకు 60 శాతం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వాలన్నారు. విశ్వవిద్యాలయాలలో చదివే ఐఐటీ, ఐఐఎం విద్యార్థులకు ఫీజులు చెల్లించాలన్నారు. జాతీయ బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ రుణాలకు విధించిన షరతులను ఎత్తివేయాలని, బీసీ కార్పొరేషన్ బడ్జెట్ సంవత్సరానికి రూ. 50 వేల కోట్లు కేటాయించి ప్రతి కుటుంబానికి 10 నుంచి 50 లక్షల వరకు 80 శాతం సబ్సిడీతో రుణాలు మంజూరు చేయాలని, కేంద్ర ప్రభుత్వ శాఖలలో, ప్రభుత్వ రంగ సంస్థలలో ఖాళీగా ఉన్న 14 లక్షల ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. బీసీల డిమాండ్ల సాధన కోసం త్వరలో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో బీసీ సంఘాల నేతలు ఎర్ర సత్యనారాయణ, సి. రాజేందర్, అనంతయ్య, నందగోపాల్, వేముల రామకృష్ణ, పి. సతీష్, రవీందర్, నిఖిల్, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌బీటీనగర్ సాయిబాబా ఆలయంలో హోమం చేస్తున్న నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి దంపతులు



భక్తులకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్



జీటీఎస్ ఆలయంలో నిర్వహించిన హోమంలో ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్, సభ్యులు

పోటెత్తిన భక్తజనం

● ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు ● బాబా ఆలయాల్లో భక్తుల కిటకిట
● భజనలు, పాటలతో నెలకొన్న సందడి ● పలు చోట్ల ఘనంగా గురువులకు సన్మానం

గురుపౌర్ణమి సందర్భంగా ఆదివారం నగరంలో కోలాహలం నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు ఆలయాలకు పోటెత్తారు. ప్రధానంగా సాయిబాబా ఆలయాలు కిక్కిరిసాయి. బాబా దర్శనానికి గంటల కొద్ది సమయం పట్టింది. ప్రజాప్రతినిధులు, అధికారులు పెద్ద సంఖ్యలో బాబాను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయినాథునికి క్షీరాభిషేకం, పుష్పాభిషేకం వైభవంగా నిర్వహించారు. పలు చోట్ల మేళ తాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య బాబా ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. అలాగే పలు విద్యాసంస్థలు, ఆలయాల్లో తమ గురువులను ఘనంగా సన్మానించారు.



బోరబండ బస్టాప్ వద్ద ఉన్న సాయిబాబా ఆలయం వద్ద దర్శనానికి బారులు తీరిన భక్తులు



ప్రకాశ్‌నగర్‌లోని సాయి బాబా ఆలయంలో పూజలు చేస్తున్న ఆలయ నిర్మాణ దాత చందన్ సింగ్ దంపతులు



సనత్‌నగర్‌లో అన్నదానం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత మర్రి శశిధర్‌రెడ్డి, తదితరులు



వెంగళరావునగర్ షిరిడీ సాయిరాం సంస్థాన్‌లో గురు పౌర్ణమి వేడుకలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి దంపతులు, సభ్యులు

మంత్రి రాకతో భక్తులకు దర్శనం నిలిపివేత

● బల్కంపేట ఎల్లమ్మ ఆలయ సిబ్బందితో భక్తుల వాగ్వాదం

అమీర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆదివారం, మంగళవారాల్లో బల్కంపేట ఎల్లమ్మను దర్శించుకునేందుకు వేలాదిగా భక్తులు తరలివస్తారు. ఈ రోజుల్లో ఏ మంత్రి వచ్చిన ఆలయ సిబ్బంది భక్తుల దర్శనాలను గంటల తరబడి నిలిపివేస్తూ భక్తుల ఆగ్రహానికి గురౌతున్నారు. ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్ వస్తున్నాడన్న సమాచారంతో ఆలయ అధికారులు, సిబ్బంది, వీఐపీ, సాధారణ భక్తుల దర్శనాన్ని సుమారు గంటకు పైగా నిలిపివేశారు.





ఎల్లమ్మ గర్భగుడిలోకి వెళ్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, క్యూలో నిలుచున్న భక్తులు

దీంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తులు చాలాసేపు వేచిఉన్నారు. మంత్రికి ఎస్ఆర్‌నగర్ పోలీసులు, ఆలయ అధికారులు స్వాగతం పలికి బాజా భజంత్రిలతో స్వాగతం పలికి దర్శనం అనంతరం తీర్థ ప్రసాదాలతో సాగనంపారు. చాలాసేపు వేచిఉన్న భక్తులు భరించలేక సిబ్బందితో వాగ్వాదానికి దిగారు.

ఎల్లమ్మ కల్యాణంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన

ఏడుగురు నిందితుల అరెస్ట్

● మూడు కత్తులు, 37 గ్రాముల గంజాయి, హాష్ ఆయిల్ స్వాధీనం

అమీర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 10న జరిగిన రథోత్సవంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు వారివద్ద నుండి 3 కత్తులు, 43 గ్రాముల గంజాయి, హాష్ ఆయిల్‌ను స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. గత సంవత్సరం జరిగిన కత్తిపోట్ల ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ముందస్తుగా 50 మందిని గుర్తించి బైండోవర్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. నేరేడ్‌మెట్ శివాలయం టెంపుల్ వీధి వినాయకనగర్‌కు చెందిన అర్జున్ (20)ని అదుపులోకి తీసుకుని ఇతని వద్ద నుంచి కత్తితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గౌతమ్‌నగర్ బోయిన్‌పల్లికి చెందిన ర్యాపిడో నడిపించే కురాకుల హరీష్ (24), ముషీరాబాద్ కవాడిగూడ కోదండరెడ్డి నగర్‌కు చెందిన జక్కుల సాయికుమార్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రెండు కత్తులు, రెండు సెల్ ఫోన్లు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. గండిపేట మండలం పీరంచెరువు హనుమాన్ హిల్స్‌కు చెందిన బక్కాని అరుణ్ అలియాస్ ఎంసీ స్టాన్, సనత్‌నగర్ అయ్యంగార్ బేకరీ సమీపంలో ఉంటున్న సయ్యద్ హమీద్ అలియాస్ శివ(19) టీకేగూడ పార్క్ సమీపంలో ఉంటున్న ప్రసన్న (31) బోరబండ సైట్ త్రి ఎస్ఆర్ పురంకు చెందిన గడ్డ ప్రనయ్ (19)లను అరెస్ట్ చేసిన పోలీసులు 37 గ్రాముల గంజాయి, 10 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బోనాల వేడుకల్లో అల్లర్లు జరుగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.





నృత్య ప్రదర్శనలు చేస్తున్న కళాకారుల

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు

మాదాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని పద్మవిభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం కుమార్తె బాలత్రిపురసుందరి శిష్యబృందం గురు పూజోత్సవం నిర్వహించారు. పరిపాహి, జతిస్వరం, ఆనందతాండవం, దశావతారం, సూర్యస్తుతి, బృందావన నిలయ్, థిల్లానా తదితర అంశాలపై కళాకారులు చక్కటి ప్రదర్శనతో సందర్శకుల మదిని దోచుకున్నారు. అనంతరం శాశ్వతి బెనర్జీ బృందం కథక్ నృత్యరూపకం ఆహూతులను కట్టి పడేసింది.

విద్యుత్ శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మోసం

● రూ. 19.50 లక్షలు తీసుకున్న టీజీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగిపై కేసు నమోదు

కొత్త పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): విద్యుత్‌శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని టీజీఎస్‌పీడీసీఎల్ ఉద్యోగి ఒకరు రూ.19.50 లక్షలు తీసుకుని మోసం చేశాడని ఒక మహిళ నాగోల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం ప్రకారం... మమతానగర్‌లో ఉండే నాగుల పాటి శ్రావణి ప్రభుత్వ ఉద్యోగం కోసం ప్రయత్నం చేస్తుంది. మేడిపల్లి ప్రశాంత్‌నగర్‌కు చెందిన బండారపు కిరణ్ కుమార్ (33)భువనగిరి టీజీఎస్‌పీడీసీఎల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. అతడిని శ్రావణికి ఒక బంధువు పరిచయం చేశాడు. విద్యుత్‌శాఖలో ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలతో అతడు ఆమెను నమ్మించి 2021 నుంచి 2023 వరకు మభ్యపెట్టి తరచూ ఆమె వద్ద, ఆమె తల్లి వద్దా పలు దఫాల్లో మొత్తం రూ. 19.50 లక్షలు వసూలు చేశాడు. పెద్దల సమక్షంలో అతడిని గట్టిగా అడిగితే కొన్నాళ్లకు నకిలీ నియామక పత్రం తెచ్చి ఆమెకు ఇచ్చాడు. అది నకిలీ అపాయింట్ మెంట్ లెటర్ అని తేలడంతో ఆమె తన డబ్బు తిరిగి ఇచ్చేయ్యాలని అడిగింది. మొదట డబ్బు ఇవ్వను అంటూ మొండికేసిన కిరణ్ కుమార్, ఈనెల మొదటి వారంలో ఆమెను కలిసి విడతల వారీగా రూ. 16 లక్షలు తిరిగి ఇస్తానని ఒప్పుకున్నాడు. అప్పటి నుంచి డబ్బులు ఇవ్వకుండా బెదిరింపులకు పాల్పడుతున్నాడని బాధితురాలు నాగోల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

పరిశ్రమలోకి చొరబడి కత్తితో బెదిరించి

రూ. 50 లక్షలు ఎత్తుకెళ్లిన దొంగలు

రాజేంద్రనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్‌లో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమలోకి గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వాచ్‌మెన్‌లను బెదిరించి రూ. 50 లక్షలు అపహరించారు. రాజస్థాన్‌కు చెందిన మహేందర్ కుమార్ 'భారతి ట్రేడర్స్' పేరుతో బుద్వేల్‌లో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 19న ఓ కంపెనీ నుంచి రూ. 21 లక్షలు, శనివారం సాయంత్రం మరో కంపెనీ నుంచి రూ.29 లక్షలు రాగా, మరికొంత డబ్బును పరిశ్రమలోని వాచ్‌మన్ గదిలో బీరువాలో పెట్టారు. కంపెనీలో వాచ్‌మెన్‌లుగా నరేష్‌కుమార్, కృష్ణ పనిచేస్తున్నారు. శనివారం అర్ధరాత్రి నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు గేటు దూకి పరిశ్రమలోకి చొరబడ్డారు. కత్తి, ఇనుపరాడ్లతో వాచ్‌మెన్‌లను బెదిరించి బీరువాలో ఉన్న రూ.50 లక్షలను దోచుకెళ్లారు. వాచ్‌మన్‌లు విషయాన్ని యజమాని మహేందర్ కుమార్‌కు చెప్పగా.. ఆదివారం ఉదయం మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీఐ భిక్షపతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు.



విద్యార్థులకు చెక్కులు అందచేసిన మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

విద్యార్థులను ఆదుకోవాలి: మాజీ మంత్రి తలసాని

బంజారాహిల్స్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందుల కారణంగా విద్యార్థులు తమ చదువులను మధ్యలోనే నిలిపివేసే పరిస్థితులను రానీయవద్దని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సనత్‌నగర్‌లోని కురగాయల మార్కెట్‌లో ఆదివారం ఈ లైబ్రరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సంకేత్ సోషల్ అవేర్ నెస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 12 మంది విద్యార్థులకు రూ.2.30 లక్షల చెక్కులు, సర్టిఫికెట్‌లను అందజేశారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ అనేకమంది పేదరికం, ఆర్థిక సమస్యల కారణంగా విద్యార్థులు మధ్యలోనే చదువు మానేస్తున్నారని అన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహించాలనే లక్ష్యంతో సంకేత్ సంస్థ ఆధ్వర్యంలో 8 సంవత్సరాల నుంచి ఆర్థిక సాయం అందిస్తున్న నిర్వాహకులను అభినందించారు. విద్యార్థులు కూడా ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడు కొలను బాల్‌రెడ్డి, నాయకులు సురేష్ గౌడ్, ప్రవీణ్ రెడ్డి, రమేష్ గౌడ్, ఖలీల్, కరీం లాలా, బోగి బాల్ రాజ్, రాజేష్ ముదిరాజ్, జమీర్, పుష్పలత, సంకేత్ సంస్థ అధ్యక్షులు మురళి, సభ్యులు మమత, ధనశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పాఠశాలను ప్రారంభిస్తున్న ఎంపీ ఈటల రాజేందర్

విద్యార్థుల భవితకు బలమైన పునాది అవసరం

మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్

పేట్‌బషీరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): గురువులు, తల్లిదండ్రులు.. విద్యార్థుల భవితకు పునాదులు వేసినప్పుడే వారు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం రంగారెడ్డినగర్ డివిజన్‌లోని బ్రైట్ ఎడ్యూకేషనల్ సొసైటీ వారి యూరో కిడ్స్ పాఠశాలను ఆయన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈటల మాట్లాడుతూ ఈ ప్రాంతంలో అత్యధికంగా పేద కార్మికులు, కర్షక కుటుంబాలు స్థిర పడ్డారని, వారి పిల్లలకు తక్కువ ఫీజులతో మెరుగైన విద్యనందించాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ విజయశేఖర్ గౌడ్, బీజేపీ మోర్చ రాష్ట్ర కార్యదర్శి దివాకర్, జిల్లా కార్యదర్శి భరతసింహారెడ్డి, మేడ్చల్ జిల్లా ట్రస్మా అధ్యక్షుడు కె. రామేశ్వర్‌రెడ్డి, స్కూల్ వ్యవస్థాపకులు లయన్ వినోద్‌జాదవ్, వికాస్‌జాదవ్, బాలరాజు, నర్సింహులు, అంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పేట్‌బషీరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. మేడ్చల్‌కు చెందిన టి.ధనరావు(45) శనివారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై బోరబండకు బయలుదేరాడు. మార్గం మధ్యలో జీడిమెట్ల వద్ద గుర్తు తెలియని వాహనం ఆయన వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంతో పక్కనే ఉన్న డివైడర్‌పై పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. ఆయన సోదరుడు వెంకటేశ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డదిడ్డ పార్కింగ్.. సెయింట్ ఆన్స్ స్కూల్‌పై ఫిర్యాదు

పేట్‌బషీరాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): సర్వీస్ రోడ్డులో వాహనాలను అడ్డ దిడ్డంగా పార్కింగ్ చేసిన స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పేట్‌బషీరాబాద్ పోలీసులకు ట్రాఫిక్ ఎస్ఐ శ్యామ్‌బాబు ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం పేట్‌బషీరాబాద్‌లోని సెయింట్‌ఆన్స్ స్కూల్ భవనం ఎదుట సర్వీస్ రోడ్డులో ఇష్టారీతిన వాహనాలను పార్కు చేస్తుండటంతో సర్వీస్ రోడ్డులో ట్రాఫిక్ జామైంది. స్కూల్ యాజమాన్యం పేరెంట్స్ మీటింగ్ ఉందని పోలీస్ స్టేషన్‌లో అనుమతులు తీసుకోకపోవడం, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడంతో స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

చలో ఇందిరా పార్కు పిలుపునకు మద్దతు

అల్లాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): వడ్డెర కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చాలని, వడ్డెరల అభ్యున్నతికి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌తో రాష్ట్ర వడ్డెర సంఘం అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు ఇచ్చిన పిలుపును మద్దతు ఇస్తున్నట్లు కూకట్‌పల్లి నియోజకవర్గం వడ్డెర సంఘం అధ్యక్షుడు కుంచపు వెంకన్న తెలిపారు. ఆయన ఆదివారం మాట్లాడుతూ రేపటి ఇందిరా పార్కు సభాస్థలికి కులస్తులతో కలిసి బయలుదేరుతున్నట్లు తెలిపారు.

అంగరంగ వైభవంగా లష్కర్ బోనాలు

● ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్న పురవీధులు ● బోనాలతో వచ్చి మొక్కులు తీర్చుకున్న మహిళలు ● కిక్కిరిసిన ఆలయ పరిసరాలు



ఉజ్జయినీ మహాకాళి అమ్మవారిని దర్శించుకున్న మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి

సికింద్రాబాద్, జూలై 21(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆచార వ్యవహారాలు, సంస్కృతీ సాంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే లష్కర్ బోనాల జాతర ఆదివారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుంచి తరలివచ్చిన భక్తులతో లష్కర్ పురవీధులు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడాయి. బోనాలతో తరలివచ్చిన మహిళలతో ఆ ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ఉజ్జయినీ మహాకాళి అమ్మవారి ఆలయంతో పాటు సోమసుందరం వీధిలోని శ్రీదేవి పోచమ్మ, కళాసిగూడలోని ముత్యాలమ్మ దేవాలయం తదితర అమ్మవారి ఆలయాల వద్ద ఆదివారం తెల్లవారుజాము నుంచే భక్తులు బారులు తీరారు. అమ్మవారికి బోనాలు సమర్పించిన మహిళలు తమకు అంతా శుభం కలగాలని మొక్కులు తీర్చుకున్నారు. తొట్టెల ఊరేగింపు, ఫలహార బండ్ల ఊరేగింపు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. పలు ప్రాంతాల నుంచి భక్తులు డప్పుచప్పుళ్లు, పోతరాజుల వీరంగాల నడుమ తొట్టెల ఊరేగింపులు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.



టకరాబస్తీలోని ముత్యాలమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న పద్మారావు కుటుంబ సభ్యులు



బోనంతో బేగంపేట్ కాంగ్రెస్ నాయకురాలు కాంచన





జాతర బందోబస్తులో నార్త్‌జోన్ డీసీపీ రేష్మి పెరుమాల్

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి : డీసీపీ

అడ్డగుట్ట: సికింద్రాబాద్ మహాకాళి జాతరలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా శాంతిభద్రల విషయంలో ప్రత్యేక దృష్టి పెట్టినట్టు నార్త్‌జోన్ డీసీపీ రేష్మిపెరుమాల్ తెలిపారు. భక్తులకు ఇబ్బంది లేకుండా ప్రశాంత వాతావరణంలో జాతర మొదటి రోజు ముగిసింది. దీంతో భక్తులు పోలీసులకు అభినందనలు తెలిపారు. మహాకాళి జాతర రెండు రోజుల పాటు జరుగుతుండగా 1500 మంది వివిధ కేడర్ పోలీసులు పకడ్బందీగా పోలీసులు డ్యూటీలు నిర్వహించారు. డీసీపీ బందోబస్తును పర్యవేక్షించారు.

బన్సీలాల్‌పేట్‌లో..

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ పరిధి బోయగూడలోని ఉప్పలమ్మ, రేణుకా ఎల్లమ్మ, గాలి పోచమ్మ సీసీనగర్‌లోని భద్రకాళి, రేణుకా ఎల్లమ్మ, ఎర్ర, నల్ల పోచమ్మ, మహంకాళి ముత్యాలమ్మ ఆలయాల నిర్వాహకుల ఆధ్వర్యంలో బోనాల జాతరను అత్యంత వైభవంగా నిర్వహించారు. పద్మారావునగర్‌లోని రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో జరిగిన బోనాల వేడుకలకు సికింద్రాబాద్ జిల్లా సాధన సమితి అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు సాయిరామ్‌చారి, హరిచారిలు ఆయనను సత్కరించారు.



రేణుకా ఎల్లమ్మకు బోనం సమర్పించటానికి వెళ్తున్న కుటుంబం





ఉత్సవాల్లో పాల్గొన్న మంత్రి పొన్నం ప్రభాకర్, అనిల్‌కుమార్‌యాదవ్, పల్లె లక్ష్మణగౌడ్ తదితరులు

వేడుకలకు హాజరైన మంత్రి పొన్నం ప్రభాకర్

మారేడుపల్లి: మారేడుపల్లి, కంటోన్మెంట్, మల్టీపర్పస్ హాల్‌లో గౌడ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పల్లె లక్ష్మణ్‌గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల వేడుకలకి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, కంటోన్మెంట్ ఎమ్మెల్యే యన్.శ్రీగణేష్, మాజీ ఎంపీ హనుమంతరావు, రాష్ట్ర మహిళ చైర్‌పర్సన్ శారద, ప్రభుత్వ రంగ కార్పొరేషన్ల చైర్మన్లు నాయుడు సత్యనారాయణ, శ్రీకాంత్, నాయకులు సి.సంతోష్‌యాదవ్, సదానంద గౌడ్, నాగినేని సరిత తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.



చిలకలగూడ: డివిజన్ పరిధిలో ఆదివారం నిర్వహించిన మహాకాళి ఉత్సవాల్లో మెట్టుగూడ కార్పొరేటర్ రాసూరి సునీత



అడ్డగుట్ట: సికింద్రాబాద్ మహాకాళి అమ్మవారిని అడ్డగుట్ట, సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ కార్పొరేటర్లు లింగాని ప్రసన్నలక్ష్మి, సామల హేమ, శైలజతో పాటు బీఆర్ఎస్ సీనియర్ నాయకులు లింగాని శ్రీనివాస్, వసంత, రజని దర్శించుకున్నారు



మహాకాళి బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతశోభన్‌రెడ్డి దంపతులు సికింద్రాబాద్‌లోని మహాకాళి అమ్మవారిని దర్శించుకున్నారు.



లష్కర్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న కోట నీలిమ, పోలీసు అధికారులు

విరామం ఎరుగని కలం యోధుడు నిర్మలానంద



మాట్లాడుతున్న సుభద్రాదేవి

రాంనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సాహిత్యోద్యమ సమష్టి కృషితో జీవితాంతం నిబద్ధతతో విరామం ఎరుగక శ్రమించిన కలం యోధుడు నిర్మలానంద అని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్మలానంద 6వ వర్ధంతి సభ సందర్భంగా నేటి సామాజిక, సాంస్కృతిక పరిస్థితులు - సాహితీ సాంస్కృతికోద్యమ కర్తవ్యాలు అనే అంశంపై సభ జరిగింది. ప్రముఖ రచయిత్రి శీలా సుభద్రాదేవి, రచయిత నాళేశ్వం శంకరం, యం. లక్ష్మి మాట్లాడారు. నిర్మలానంద దోపిడీ పీడనలు, అంతరాలు, హింసలేని సమాజాన్ని ఆకాంక్షించారని అన్నారు. పీడిత ప్రజల విముక్తిని బలంగా కాంక్షిస్తూ ఇతర భాషల్లోకి సాహిత్యాన్ని తెలుగులోకి, తెలుగు నుంచి హిందీలోకి అనువదించారని గుర్తు చేశారు. జనసాహితీ జంటనగరాల శాఖ కార్యదర్శి డాక్టర్ భట్టు లక్ష్మీనారాయణ సభకు అధ్యక్షత వహించారు.

త్యాగరాయగానసభకు జేఎన్‌టీయూ నాణ్యతా పత్రం



జేఎన్‌టీయూ అందజేసిన నాణ్యతా పత్రం చూపిస్తున్న జనార్దనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: త్యాగరాయగానసభ కట్టడం పటిష్ఠంగా ఉందని జేఎన్‌టీయూహెచ్ ఇంజనీరింగ్ విభాగం అధికారులు నాణ్యతా పత్రం అందజేశారని గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి ఆదివారం విలేకరుల సమావేశంలో తెలిపారు. గానసభ కట్టడంపై జేఎన్‌టీయూను సంప్రదించగా ఇంజనీరింగ్ విభాగానికి చెందిన పదిమంది నిపుణులు శనివారం పరిశీలించి అన్ని పేరామీటర్స్‌లోనూ దృఢంగా ఉందని నాణ్యతా పత్రం అందజేశారని వివరించారు. గానసభ కార్యవర్గసభ్యులు, హాస్యావధాని శంకరనారాయణ, చక్రపాణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కత్తితో బెదిరించి రూ.50 లక్షలు చోరీ

రాజేంద్రనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కాటేదాన్‌లోని బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమంలో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి వాచ్‌మన్‌ను కత్తితో బెదిరించి రూ. 50 లక్షల నగదు ఎత్తుకెళ్లారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి 2.30 గంటలో ప్రాంతంలో జరిగింది. వివరాల్లోకి వెళితే.. రాజస్థాన్‌కు చెందిన మహేందర్ కుమార్ 'భారతి ట్రేడర్స్' పేరుతో బ్యాటరీ రీసైక్లింగ్ పరిశ్రమను కాటేదాన్ బుద్వేల్‌లో నిర్వహిస్తున్నాడు.

ఈ నెల 19న తనకు ఓ కంపెనీ నుంచి రూ.21 లక్షలు, శనివారం సాయంత్రం మరో కంపెనీ నుంచి రూ.29 లక్షలు రాగా, మరికొంత డబ్బును పరిశ్రమలోని వాచ్‌మన్ గదిలోని బీరువాలో దాచిపెట్టాడు. కంపెనీలో వాచ్‌మన్‌లుగా నరేష్‌కుమార్, కృష్ణ పని చేస్తున్నారు. అర్ధరాత్రి 2:30 గంటల ప్రాంతంలో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులు గేటు దూకి పరిశ్రమలోకి చొరబడ్డారు. వారి వద్ద ఉన్న కత్తి, ఇనుపరాడ్లతో వాచ్‌మన్‌లను బెదిరించి బీరువాలో ఉన్న రూ. 50 లక్షలను దోచుకెళ్లారు. ఈ విషయాన్ని వాచ్‌మన్‌లు యజమాని మహేందర్ కుమార్‌కు సమాచారం ఇవ్వగా, ఆయన ఆదివారం ఉదయం మైలార్‌దేవుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మైలార్‌దేవుపల్లి ఇన్‌స్పెక్టర్ నరేందర్, డీఐ భిక్షపతి ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. క్లూస్ టీమ్ ద్వారా వేలిముద్రలు సేకరించారు. రాజేంద్రనగర్ డీసీపీ సీహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

మాదాపూర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని శిల్పారామంలో గురు పౌర్ణమి పురస్కరించుకుని పద్మవిభూషణ్ డాక్టర్ వెంపటి చిన్న సత్యం కుమార్తె బాలత్రిపురసుందరి శిష్యబృందం గురుపూజోత్సవం నిర్వహించారు. పరిపాహి, జతిస్వరం, ఆనందతాండవం, దశావతారం, సూర్యస్తుతి, బృందావన నిలయ్, థిల్లాన తదితర అంశాలపైకళాకారులు చక్కటి ప్రదర్శనతో సందర్శకుల మదిని దోచుకున్నారు. అనంతరం శాశ్వతి బెనర్జి బృందం కథక్ నృత్యరూపకం సందడి సందడిగా సాగింది.

ఎల్లమ్మ కల్యాణంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన ఏడుగురి అరెస్ట్

● మూడు కత్తులు, 37 గ్రాముల గంజాయి, హాష్ ఆయిల్ స్వాధీనం

అమీర్‌పేట, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బల్కంపేట ఎల్లమ్మ కల్యాణం, 10న జరిగిన రథోత్సవంలో అల్లర్లు సృష్టించేందుకు యత్నించిన ఏడుగురు నిందితులను అరెస్ట్ చేసిన ఎస్ఆర్‌నగర్ పోలీసులు వారివద్ద నుండి 3 కత్తులు, 43 గ్రాముల గంజాయి, హాష్ ఆయిల్ ను స్వాధీనం చేసుకుని శనివారం రిమాండ్‌కు తరలించారు. గత సంవత్సరం జరిగిన కత్తిపోట్ల ఘటన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు ముందుస్తుగా 50 మందిని గుర్తించి బైండోవర్ చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను ఇన్‌స్పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి ఆదివారం వెల్లడించారు. నేరెడ్‌మెట్ శివాలయం టెంపుల్ వీధి వినాయకనగర్‌కు చెందిన అర్జున్ (20)ని అదుపులోకి తీసుకుని ఇతని వద్ద నుంచి కత్తితో పాటు మొబైల్ ఫోన్‌ను స్వాధీనం చేసుకున్నారు. అలాగే గౌతమ్‌నగర్ బోయిన్‌పల్లికి చెందిన ర్యాపిడో నడిపించే కురాకుల హరీష్ (24), ముషీరాబాద్ కవాడిగూడ కోదండరెడ్డి నగర్‌కు చెందిన జక్కుల సాయికుమార్ యాదవ్‌ను అదుపులోకి తీసుకుని వీరి వద్ద నుంచి రెండు కత్తులు, రెండు సెల్ ఫోన్లు, ఒక బైకును స్వాధీనం చేసుకున్నారు. గండిపేట మండలం పీరంచేరువు హనుమాన్ హిల్స్‌కు చెందిన బక్కాని అరుణ్ అలియాస్ ఎంసీ స్టాన్, సనత్‌నగర్ అయ్యంగార్ బేకరీ సమీపంలో ఉంటున్న సయ్యద్ హమీద్ అలియాస్ శివ(19) బీకేగూడ పార్క్ సమీపంలో ఉంటున్న ప్రసన్న (31) బోరబండ సైట్ త్రి ఎన్ఆర్ఆర్ పురంకు చెందిన గడ్డ ప్రనయ్ (19)లను అరెస్ట్ చేసిన పోలీసులు 37 గ్రాముల గంజాయి, 10 గ్రాముల హాష్ ఆయిల్ స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం జరుగుతున్న బోనాల వేడుకల్లో అల్లర్లు జరుగకుండా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వారిని రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ వెల్లడించారు.

ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై ప్రమాదం

● తీవ్రంగా గాయపడ్డ ఇద్దరు యువకులు

ఖైరతాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు యువకులు ఖైరతాబాద్ ఫ్లైఓవర్ పైన ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డారు. ఖైరతాబాద్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇద్దరు యువకులు ఖైరతాబాద్ ఫ్లైఓవర్‌పై రోడ్డు ప్రమాదానికి గురయ్యారని సమాచారం అందడంతో ట్రాఫిక్ పోలీసులు అక్కడకు వెళ్లి చూడగా ఫ్లైఓవర్ మధ్యలో ఇంకా రిజిస్ట్రేషన్ కాని యమహా వాహనంపై రాజ్‌కుమార్(18) వాహనాన్ని నడుపుతుండగా వివేక్ అనే యువకుడు వెనక కూర్చోగా వారంతట వారే డివైడర్‌ను ఢీకొని పడిపోయినట్టు గుర్తించారు. వారిద్దరూ అపస్మారక స్థితిలో ఉండగా 108 అంబులెన్స్‌లో గ్లోబల్ ఆస్పత్రిలో చేర్పి చికిత్స అందిస్తున్నారు. తలకు బలమైన గాయాలు కావడంతో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నదని పోలీసులు తెలిపారు. మరో మిత్రుడు ఆస్పత్రికి రావడంతో అతడిద్వారా వివరాలు సేకరించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామని, కేసు విచారిస్తున్న ఎస్ఐ రమణ తెలిపారు.

శాకంబరిదేవి అలంకరణలో అమ్మవారు



తిరుమలగిరి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలోని కట్టమైసమ్మ అమ్మవారు ఆదివారం శాకంబరిదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.

వర్షాల నేపథ్యంలో తిరుమలగిరిలో హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు

తిరుమలగిరి జూలై 21 (ఆంధ్రజ్యోతి): వర్షాలు కురవడంతో హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు తిరుమలగిరి మండల కార్యాలయంలో ప్రజల సౌకర్యార్థం హెల్ప్‌లైన్ నంబర్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్ అశోక్‌కుమార్ ఆదివారం తెలిపారు. మండలం పరిధిలో వర్షాలకు దెబ్బతిన్న, కూలిన ఇళ్లు, ఇళ్లలోకి వర్షం నీళ్లు వచ్చిన, మరే ఇతర ప్రమాదం సంభవించిన ఫోన్ చేయాలని సూచించారు. తహసీల్దార్‌కు సమస్యపై ఫోన్ చేయగానే మండల స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లకు సమాచారం అందించి సమస్యను పరిష్కరిస్తామని చెప్పారు. వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రమాదం జరిగినా స్పెషల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు సమ్మయ్య, సాయి, శేఖర్, వినయ్‌కుమార్, బాలకుమార్‌లు పర్యవేక్షిస్తారని తెలిపారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ సెల్ నంబర్ 9063425682.

శ్రీనివాస్‌నగర్‌లో కార్పొరేటర్ పర్యటన

బౌద్ధనగర్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాస్‌నగర్‌కాలనీలో కార్పొరేటర్ సామల హేమ ఆదివారం పర్యటించారు. శనివారం రాత్రి కురిసిన భారీ వర్షంతో జలమండలి కార్యాలయం వద్ద చెట్టు విరిగి పడింది. విషయం తెలుసుకున్న కార్పొరేటర్ డీఆర్ఎఫ్ టీమ్‌కు సమాచారమందించారు. అధికారులతో కలిసి చెట్టు తొలగించే వరకూ అక్కడే ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకుడు కరాటే రాజు తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు అభిషేకాలు.. అర్చనలు

ఆలయాల్లో ఘనంగా గురుపౌర్ణమి వేడుకలు

బోయిన్‌పల్లి, జూలై 21(ఆంధ్రజ్యోతి): గురుపౌర్ణమిని పురస్కరించుకుని న్యూబోయిన్‌పల్లి జయనగర్‌లోని సాయిబాబా దేవాలయంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి, మల్లారెడ్డి మెడికల్ కళాశాల అధిపతి భద్రారెడ్డి, కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన్నప్రతాప్‌లు ముఖ్యఅతిథులుగా హాజరై ప్రత్యేక పూజలు, అభిషేక పూజలు నిర్వహించారు. మల్లారెడ్డి సతీమణి కల్పనారెడ్డితో పాటు ఆలయ కమిటీ సభ్యులు పూర్ణ, టింకుగౌడ్, మహవీర్ పాల్గొన్నారు.

● **సీతాఫల్‌మండి, బౌద్ధనగర్‌లో..**

బౌద్ధనగర్: సీతాఫల్‌మండి, బౌద్ధనగర్ డివిజన్‌లో గురుపౌర్ణమి వేడుకలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మైలార్‌గడ్డలోని సాయిబాబా ఆలయచైర్మన్ మింగు వెంకటసాయికుమార్ (నైవేద్యం) ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. జలంధర్‌రెడ్డి, ప్రభుగుప్తా, కేపీ యాదవ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

● **మారేడుపల్లిలో..**

మారేడుపల్లి: వెస్ట్‌మారేడుపల్లిలోని పద్మశాలి కల్యాణ మండపంలోని యోగొదా సత్సంగ్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పరమహంస యోగానంద భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. వైఎస్ఎస్ ధ్యాన కేంద్రం కమిటీ ఆధ్వర్యంలో గురువు చిత్రపటానికి పుష్పాంజలి అర్పించారు.

● **బొల్లారంలోని కుటియ మందిరంలో.**

తిరుమలగిరి: గురుపౌర్ణమిని పురస్కరించుకొని తిరుమలగిరి, బొల్లారంలోని కుటియ మందిరంలో సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

● పద్మారావునగర్: సాయి సప్తాహ వేడుకల్లో భాగంగా ఏడో రోజు గురుపౌర్ణమిని పుర్కరించుకొని ఆలయంలోని సాయిబాబాకు ఆశ్రమ వ్యవస్థాపకులు సద్గురు డాక్టర్ సాయికుమార్ బాబా 108 కళశాలతో గోక్షీరము, పంచఫల రసములతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.



బోయిన్‌పల్లి గణపతి సాయినాథ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు



మారేడుపల్లిలో గురుచిత్రానికి పుష్పాంజలి



సీతాఫల్‌మండిలో సాయిబాబా విగ్రహం వద్ద పూజలు చేస్తున్న ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, సాయికుమార్ తదితరులు



బాబాకు పంచఫల రసాభిషేకం చేస్తున్న సాయికుమార్ బాబా



బేగంపేట ప్రకాశ్‌నగర్‌లోని సాయి దేవాలయంలో గురుపౌర్ణమి వేడుకల్లో ఆలయ నిర్మాణ దాత చందన్ సింగ్ దంపతులు